# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 14, జులై 2026

## జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, జులై 13, ప్రభాతవార్త :**



జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కె. హరితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు టి. సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శి పర్వతి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు పి. నాగేందర్, కోశాధికారి జె. లలిత్ కుమార్, సభ్యులు బి. కిరణ్ కుమార్, ముకశిర్ పాషా, ఎం. యాదగిరి, బి. వెంకన్న, పి. సంతోష్, ఎం.డి. ఇసాక్, ధనుంజయ్, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఉపాధ్యాయులే విద్యావ్యవస్థకు మూలస్తంభాలు

**✪ కొమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హరిత**

**ఆసిఫాబాద్ టౌన్, జులై 13, ప్రభాతవార్త :**

ప్రాథమిక ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు మూలస్తంభాలని, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రాథమిక విద్య ద్వారానే ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో మండల రిసోర్స్ పర్సన్ ల మూడు రోజుల జిల్లా స్థాయి సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి శిక్షణ మాడ్యూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారిలో చదవడం, రాయడం, గణించడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థి కేంద్రిత అభ్యాస పద్ధతులు, సమగ్ర బోధన విధానాలను ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఈ శిక్షణలో మండల రిసోర్స్ పర్సన్లకు బోధనా నైపుణ్యాల పెంపు, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ, సమగ్ర బోధన, అభ్యసన ఫలితాల అంచనా, వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల సామర్థ్యాల అభివృద్ధి వంటి అంశాలపై నిపుణులు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఎంఆర్పీలు తమ మండలాల్లోని ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా వ్యవహరించి విద్యా ప్రమాణాల పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జూలై 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎంపికైన మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కోర్స్ ఇన్‌చార్జి అడే ప్రకాష్, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు, వివిధ మండలాల ఎంఆర్పీలు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి

**✻ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్**

**✻ ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు సమీకృత శిక్షణ ప్రారంభం**

**మంచిర్యాల, జూలై 13, ప్రభాతవార్త:**



పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం నులిపురుగుల నిర్మూలనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు స్వయంగా మాత్రలు తినిపించారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అంగన్వాడీలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన నీరు తాగడం వంటి అలవాట్లతో నులిపురుగులను నివారించవచ్చని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సమీకృత శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆధునిక బోధనా విధానాలను అవలంబిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి పెన్షన్‌దారులకు రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలి

**★ యూనియన్ బ్యాంకు ఎదుట విశ్రాంత ఉద్యోగుల ధర్నా ★ బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం**

**మంచిర్యాల, జూలై 13, ప్రభాతవార్త:**

ఎస్‌బిఐ బ్యాంకు తరహాలో యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు రూ.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు శాఖ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ గుల్షన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, గత రెండు నెలలుగా ప్రమాద బీమా అంశంపై బ్యాంకు అధికారులను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన

మిగతా 2లో..




## ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలి



2లో..

**✪ ప్రజల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**✪ అధికారులు సమన్వయంతో పనిచేసి తక్షణమే స్పందించాలని ఆదేశం**

– నిర్మల్, జూలై 13, ప్రభాతవార్త:

# సిపిఎం మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

**రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి : సీపీఎం జిల్లా కార్యదర్శి బొడంకి చందు**

**చెన్నూరు జులై 13, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగం,ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఈనెల 15న తలపెట్టిన సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బోడంకి చందు అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో సీపీఎం పార్టీ అధ్వర్యంలో దర్నాపోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడంకి చందు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్ర వచ్చి 79 సంవత్సరాలు అయినా నేటికీ రోజు రోజుకు పెరుగు తున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేవని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఉద్యోగాల భర్తీ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీతో 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడిచినప్పటికీ హామీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన పాలకులు "పకోడీలు, బజ్జీలు చేయడం కూడా ఉద్యోగాలే అనడం అత్యంత బాధాకరమైన వైఖరని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు లక్షల్లో కొలువులు ఖాళీగా ఉన్నాయనీ, వెంటనే భర్తీ చేయాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, వచ్చిన నోటిఫికేషన్లో పేపర్ లీకేజీలు, పరీక్ష వాయిదాలు, కోర్టు వివాదాలతో నిరుద్యోగుల జీవితాలతో అడుకున్నారని ఎద్దేవా చేసారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షలు ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలి. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్లాక్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలనే డిమాండ్ తో జూలై 15న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించబోయే సీపీఎం మహా ధర్నా ను విజయవంతం చేయాలన్నారు. ఈ మహా ధర్నాకు యువకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిపిఎం నాయకులు సిడం సమ్మక్క, కృష్ణమాచారి,ఎర్రోళ్ల సంజీవ్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లక్క, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**- డీ. శ్రీనివాస్ తల్లి చిత్రపటానికి నివాళి..**

**ప్రగాఢ సానుభూతి ప్రకటన**

**భైంసా, జులై 13, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని సాయి కాటన్ కాలనీలో నివాసం ఉంటున్న డీ. శ్రీనివాస్ తల్లి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సోమవారం వారి నివాసానికి వెళ్లారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులంతా ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



**కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన జిల్లా క్రీడాకారులు



**ఆసిఫాబాద్, జులై 13, ప్రభాతవార్త**

తైక్వాండో, కరాటే విభాగాల్లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన జిల్లాకు చెందిన విద్యార్థులకు సోమవారం జిల్లా కలెక్టర్ కె. హరిత సర్టిఫికెట్లు, పతకాలు ప్రదానం చేశారు. వీరిలో కె.నవనీత్ చంద్ర, కట్కూరి త్రీనాథ్, కే.అశ్విత్ యాదవ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ జిల్లాకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. క్రీడల్లో సాధించిన విజయాలతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పేరును ప్రపంచ వేదికపై నిలబెట్టిన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి విజయాలు మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ ఆశ్వాక్ హైమద్, ఖేలో ఇండియా కోచ్ కడతాల రాకేష్, జిల్లా కార్యదర్శి ఎం.దేవయ్య, అధ్యక్షుడు వి.రవి, క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# నాతరి స్వామి జన్మదినం సందర్భంగా అల్పాహారం పంపిణీ

**బెల్లంపల్లి, జూలై 13, ప్రభాతవార్త:**



బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రోజున అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. టిపిసిసి రాష్ట్ర క్యాంపెయిన్ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని వారి పేరుమీద ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, నిరుపేదలు, ఆటో డ్రైవర్లు, బాటసారులు, చిరు వ్యాపారస్తులకు ఉచితంగా 300 మందికి పైగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రంగ రామన్న, కంటెవాడ నాగేష్ కుమార్, రత్నం రాజన్న, గెల్లీ జయరాం యాదవ్, భోగ శ్రీనివాస్, లింగాల రాజేశం, నాగులు లింగయ్య, కందుల సత్తయ్య, ఏనుగు నరేష్, ఎలిగేటి మల్లేష్, భీమిని కనకయ్య గౌడ్, గర్రె పెల్లి శ్రీనివాస్, గైని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలి

**నిర్మల్, జూలై 13, ప్రభాతవార్త:**

ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల సమస్యల ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని సూచించారు. ముఖ్యంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించేలా బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి పలు దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి పెన్షన్‌దారులకు రూ.50 లక్షల పమ్రాద బీమా కల్పించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

లేకపోవడంతో నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. 15 రోజుల్లోగా ప్రమాద బీమాపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని, లేదంటే కుటుంబ సభ్యులతో కలిసి యూనియన్ బ్యాంకుల ఎదుట భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్యతో పాటు పలువురు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నారులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

**- నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యవంతమైన ఎదుగుదల: సర్పంచ్ కోట వేణుగోపాల్**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 13, ప్రభాతవార్త :**

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బారెగూడ-2 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల కడుపులో ఉండే నులిపురుగులు పోషకాహారాన్ని శరీరానికి అందకుండా అడ్డుకోవడంతో పాటు రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అల్బెండాజోల్ మాత్రలు ఇవ్వడం ద్వారా నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా అల్బెండాజోల్ మాత్రలు వేయించాలని, ఆరోగ్యకరమైన బాల్యమే బలమైన భారతదేశానికి పునాదని సర్పంచ్ వేణుగోపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తార, ఆశ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.



# యుక్త వయసు పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు అందించాలి

**ఆసిఫాబాద్, జులై 13, ప్రభాతవార్త :**

జిల్లాలో 19 సంవత్సరాల లోపు పిల్లలు, యుక్త వయసు ఉన్న వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు అందించాలని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 19 సంవత్సరాలలోపు వయసు ఉన్న ప్రతి ఒక్కరూ ఆల్బెండజాల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లలలో నులిపురుగులను నివారించవచ్చని, పోషణ మెరుగుపడుతుందని, ఆరోగ్యకర ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తద్వారా పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై చదువుపై దృష్టి పెరుగుతుందని, మంచి భవిష్యత్తుకు సహాయపడుతుందని తెలిపారు. ఆల్బెండజోల్ కు మాత్రలు విద్యార్థులకు అందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతిరోజు రుచికరంగా భోజనాన్ని అందించడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారంగా ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్ర, వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ హరిత

## నేడు బిఎల్ఎ ల సమావేశం

**తాండూర్, జులై 13, ప్రభాతవార్త :**

14న తాండూర్ గ్రామ పంచాయతీలోని బీసీ కమ్యూనిటీ హాల్ లో ఉదయం 10 గంటలకు బిఎల్ఎ ల ముఖ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద బోయిన శంకర్ తెలిపారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మండలంలోని బిఎల్ఎ లు, కాంగ్రెస్ సర్పంచులు, ఉప సర్పంచులు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ కార్యవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం ఆయన కోరారు.



చిన్నారికి మాత్ర వేస్తున్న సర్పంచ్ లక్ష్మణ్

## ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

**తాండూర్, జులై 13, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం మాదారంలోని అంగన్వాడీ3 కేంద్రంలో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పిల్లలకు నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుషనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు చిన్నపిల్లల్లో రక్తహీనత, నిరోధించడానికి, ఆరోగ్యంగా, చురుకుగా ఉండడానికి ఉపయోగపడతాయన్నారు. 1 నుండి 19 సంవత్సరాలు గల పిల్లలందరికీ మాత్రలను వేయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బానేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, అంగన్వాడి కేంద్రం టీచర్ మీనా, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్ మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యే పూజలు

**- సకాలంలో వర్షాలు పడి, పంటలు బాగా పండాలని శివునికి ప్రార్థన**

**నేరడిగొండ, జూలై 13, ప్రభాతవార్త**

వందేళ్లకోసారి వచ్చే అత్యంత పవిత్రమైన మహాశైవాక్ష యోగం సందర్భంగా సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని శివాలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వర్షాలు కురిసి, భూగర్భ నీటిమట్టాలు పెరిగి రైతుల పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నీలిమ రవీందర్‌రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు సుజీల్, బాబులాల్, ఎలుక రాజు తదితరులు పాల్గొన్నారు.





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, చిత్రంలో స్థానిక నాయకులు

## పరామర్శ

**సారంగాపూర్, జులై 13, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలోని మీసేవ సెంటర్ నిర్వాహకుడు సింగం శివ తండ్రి, అడెల్లి ఆలయ మాజీ చైర్మన్ సింగం భోజగౌడ్ సోదరుడైన సింగం రాజేశ్వర్ గౌడ్ జులై 9న మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సారంగాపూర్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి సోమవారం అడెల్లి గ్రామానికి వెళ్లారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భోజగౌడ్, సింగం శివ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. రాజేశ్వర్ గౌడ్ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. ఆయన వెంట నాయకులు కరిపే విలాస్, అడెల్లి పోచమ్మ దేవస్థానం ప్రస్తుత చైర్మన్ భోజగౌడ్, కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్, రాము తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

**- జూలై 24లోపు ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలి**

**- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**మంచిర్యాల, జూలై 13, ప్రభాత వర్త:**

ఒటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్వే విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు. సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జూలై 24లోపు కొత్త ఓటరు నమోదు, పేరు తొలగింపు, వివరాల సవరణ, పోలింగ్ కేంద్రం మార్పు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలవుతుందని, ఆగస్టు నుంచి అక్టోబర్ 24 వరకు అభ్యంతరాలు, సవరణలకు అవకాశం ఉంటుందని, అక్టోబర్ 31న తుది జాబితా విడుదల కానుందని తెలిపారు. ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకునేలా సకాలంలో వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మేయర్ దర్నీ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

**- సిపిఎం మండల కార్యదర్శి దాగం రాజారాం**

**తాండూర్, జులై 13, ప్రభాతవార్త :**



వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే భర్తీ చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. ఈనెల 15న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను సోమవారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడం వలన నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన చేశారు. మహాధర్నకు నిరుద్యోగ యువత తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, మొగిలి, రాములు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య

## న్యాణ్యమైన విద్యకు ఉపాధ్యాయుల నైపుణ్యాలే కీలకం

### - అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య జిల్లా స్థాయి ఇన్‌సర్వీస్ శిక్షణ పరిశీలన

**మంచిర్యాల, జూలై 13, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుని విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం ఓల్డ్ మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సమగ్ర ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల శిక్షణను ఆయన పరిశీలించి, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ నిర్వహణ, హాజరు, బోధనా సామగ్రిని పరిశీలించిన ఆయన, శిక్షణ అనంతరం బోధనా విధానాల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**హాజీపూర్, జూలై 13, ప్రభాతవార్త:**

మండలంలోని కొలంగూడ గ్రామంలో అంచనా వ్యయం 38.15 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను సోమవారం మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో 40 కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని చెప్పారు. వచ్చే దసరా పండుగ వరకు తనే స్వయంగా వచ్చి భూమి పూజ చేస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.గ్రామస్థులు ఎమ్మెల్యేకు మంచినీటి సమస్య ఉందని చెప్పగానే ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారికి ఫోన్ చేసి అతి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, సంబంధిత అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

**లింగాపూర్, జులై 13, ప్రభాతవార్త,**

లింగాపూర్ జై జగదాంబ మండల సమైక్య కార్యాలయంలో ఐకెపి వివోఏ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని నిరాసిస్తూ ధర్నా కూర్చోవడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సలాం హనుమంతరావు మాట్లాడుతూ మోము సెర్ప్ సంస్థ లో గత 25 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాము, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా 18 వేల రూపాయలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పి నిరక్ష్యంగా వ్యవహరిస్తుంది, కనీస ఉద్యోగులుగా గుర్తించడం లేదు, మాతో వెట్టి చాకిరి చెయ్యిస్తున్నారే తప్ప మా న్యాయమైన సమస్యలు పరిష్కరించడం లేదు, మేమే మన గొంతు మా కోరికలు కోరుకోవడం లేదు, శ్రమ దోపిడి విధానాన్ని హరికట్టి చేస్తున్న పనికి తగినంత వేతనం ఇచ్చి. సెర్ప్ఉద్యోగులుగా గుర్తించాలి.ప్రభుత్వ అధికారు లకు మంత్రులకు ఎన్నిసార్లు వినిపించినప్పటికీ పట్టించుకోవడం లేదు చేస్తాం చూస్తామనేటోలే తప్ప మా గురించి పట్టించుకోవడం లేదు. విధులు నిర్వహిస్తూ చనిపోయిన కుటుంబాలకు కనీసం 10 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో జాదవ్ రవీందర్, జగ్గక మారుతి, ఆడే బాలు, మడవి సోను కుమార్, మెస్రం తుర్జాబాయి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా కూర్చున్న ఐకేపి వివోఏ ఉద్యోగులు

## విద్యార్థులకు రూ.6 వేల విద్యా సామగ్రి పంపిణీ

### - ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 13, ప్రభాతవార్త :**

జవ్వాజీగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూ.6,000 విలువైన విద్యా సామగ్రిని దాత మార్త రమేష్ సోమవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు పణితి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ డోంగ్రీ రాధాబాయి, ఉపసర్పంచ్ మహేందర్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు అనురాధాబాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాత మార్త రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని మంచి భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.సర్పంచ్ డోంగ్రీ రాధాబాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో విలువైనదని, ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు.మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలకు సహకరించిన దాత మార్త రమేష్‌ను అభినందించారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు అనురాధాబాయి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి తోడ్పడుతున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సామాగ్రి పంపిణి చేస్తున్న దృశ్యం



మాత్రలు వేస్తున్న దృశ్యం

## విద్యార్థులకు ఆల్బెండజోల్ పంపిణీ

**వేమనపల్లి, జులై 13, ప్రభాతవార్త:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. చిన్నారుల్లో నులిపురుగుల సమస్యను నివారించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి. శ్రీధర్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. అన్వేష్, ఎంపీడీఓ కుమారస్వామి పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

### - కలెక్టర్ కుమార్ దీపక్‌క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆదేశం

**మంచిర్యాల, జూలై 13, ప్రభాతవార్త:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, డీఆర్వో మోతిరామ్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 52 దరఖాస్తులు అందాయని, శాఖల సమన్వయంతో వాటిని త్వరగా పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం గత వరదల్లో మృతి చెందిన గొర్రెలకు సంబంధించి యజమాని పొనవేని రాజబాబుకు రూ.1.25 లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు.



# గొర్రెల నష్టానికి రూ.1.25 లక్షల పరిహారం అందజేత



**మంచిర్యాల, జూలై 13, ప్రభాతవార్త:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత మంచిర్యాలలో గుర్తుతెలియని అటవీ జంతువు దాడిలో 45 గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధితుడు పొనవేణి రాజబాపుకు రూ.1.25 లక్షల నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అందజేశారు. బాధితుడి సమస్యను తెలుసుకున్న వెంటనే రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిహారం మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాతృభాషే ఆంగ్ల భాషాభ్యసనానికి మూలాధారం

**- భైంసా డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు యు. రవికుమార్‌కు పీహెచ్‌డీ పట్టా**

**- నాందేడ్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రదానం.. కళాశాల సిబ్బంది హర్షం**

**భైంసా, జులై 13, ప్రభాతవార్త:**

విద్యార్థులు ఆంగ్ల భాషను ఎంత సమర్థవంతంగా నేర్చుకుంటారనేది వారి మాతృభాషతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుందని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్లశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ యు. రవికుమార్ నిరూపించారు. ఆయన చేపట్టిన విశిష్ట పరిశోధనకు నాందేడ్‌లోని స్వామి రామానంద తీర్థ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసింది. ఖడిగ్రీ స్థాయి విద్యార్థుల ఆంగ్ల భాష అభ్యసనంలో వివిధ మాతృభాషల ప్రభావం ఒక తులనాత్మక పరిశోధనఖి అనే అంశంపై ఆయన ఈ పరిశోధనను నిర్వహించారు. బహుభాషా సమాజంలో ఆంగ్ల భాషా బోధనకు ఈ అధ్యయనం కొత్త దిశను చూపుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిశోధనలో ప్రతి మాతృభాష విద్యార్థుల ఆంగ్ల భాష అభ్యసనాన్ని భిన్న రీతిలో ప్రభావితం చేస్తుందని తేలింది. ఉచ్చారణ, పదసంపద, వ్యాకరణ వినియోగం, భాషా వ్యక్తీకరణ వంటి అంశాల్లో మాతృభాష ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని అధ్యయనం వెల్లడించింది. అలాగే, ఒక్కో మాతృభాషకు చెందిన విద్యార్థులు ఆంగ్ల భాషను నేర్చుకునే విధానంలో కూడా గణనీయమైన తేడాలు ఉన్నట్లు పరిశోధకుడు గుర్తించారు. ముఖ్యంగా, విద్యార్థుల మాతృభాష, ఉపాధ్యాయుల మాతృభాష ఒకటే అయినప్పుడు విద్యార్థులు భాషా నైపుణ్యాలను మరింత వేగంగా, సులభంగా అలవర్చుకుంటారని పరిశోధన నిర్ధారించింది. అందువల్ల ఆంగ్ల అధ్యాపకులు విద్యార్థుల మాతృభాషలపై కనీస అవగాహన కలిగి ఉంటే బోధన



మరింత ఫలవంతంగా మారుతుందని రవికుమార్ సూచించారు. ప్రస్తుత బహుభాషా విద్యా వ్యవస్థలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా విధానాలను రూపొందించడంలో ఈ పరిశోధన మార్గదర్శకంగా నిలుస్తుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. భాషా బోధనలో మాతృభాష ప్రాధాన్యతను శాస్త్రీయంగా చాటిచెప్పిన ఈ పరిశోధన ఉన్నత విద్యా రంగానికి విలువైన తోడ్పాటుగా నిలుస్తుందని కొనియాడారు. యు. రవికుమార్ సాధించిన ఈ విశిష్ట విజయంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, సహచర అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, చిత్రంలో స్థానిక నాయకులు

## రూ. 20 లక్షల సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**- రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: కాంట్రాక్టర్‌కు ఆదేశం**

**నేరడిగొండ, జూలై 13, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలోని న్యూ హనుమాన్ కాలనీలో రూ. 20 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన.. రోడ్డు నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండల పరిధిలోని ప్రతి కాలనీలో అంతర్గత రహదారుల సమస్యను పరిష్కరిస్తామని, అన్ని వీధుల్లో సీసీ రోడ్లు వేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణం నిలిపివేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఆసిఫాబాద్, జులై 13, ప్రభాతవార్త**

ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ ఎంపీపీ పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ భీమేశ్ జిల్లా కలెక్టర్ హరితకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో ఇప్పటికే విద్యార్థుల ఆట స్థలానికి సరిపడా స్థలం లేదని, విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. అదే ప్రాంగణంలో భవనం నిర్మిస్తే సమస్య మరింత పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని భవన నిర్మాణం నిలిపివేయాలని కలెక్టర్ ను కోరారు.

## బాలల హక్కులపై అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 13, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బాలల సభ నిర్వహించారు. బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యక్తిగత భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి అభిప్రాయాలను తెలుసుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు. సభకు గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి, ఉప సర్పంచ్ షేక్ సాజిద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్, ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠశాల అవసరాలు, పరిశుభ్రత, క్రమశిక్షణ, మొక్కల సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు. సర్పంచ్ వసాకే పుల్లబాయి మాట్లాడుతూ బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.





## పల్లె దవాఖాన భవనాన్ని ప్రారంభించండి

**- కలెక్టర్ భవేశ్ మిశ్రాకు దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి వినతి**

**- తక్షణమే చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించిన కలెక్టర్**

**భైంసా, జులై 13, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖాన భవనాన్ని తక్షణమే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి డిమాండ్ చేశారు. భవనం నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభించకపోవడంపై సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనం అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ప్రారంభానికి నోచుకోవడం లేదని కలెక్టర్ సమక్షంలో ఆవేదన వ్యక్తం చేశారు. దేగాంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ పల్లె దవాఖానా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సర్పంచ్ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన కలెక్టర్.. అక్కడే ఉన్న జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ)ని పిలిచి, దేగాం పల్లె దవాఖాన భవన ప్రారంభానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.





## దుబాయ్‌లో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి యువత ఆర్థిక సహాయం

**- రూ. 27,500 విరాళాలు అందజేసి మానవత్వం చాటుకున్న సొసైటీ, యూత్ సభ్యులు**

**సారంగాపూర్, జులై 13, ప్రభాతవార్త:**

దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన శివరాత్రి నరసింహులు కుటుంబానికి స్థానిక యువత అండగా నిలిచారు. నరసింహులు మృతితో తీవ్ర ఆవేదనలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను సోమవారం యువకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన నవభారత్ వెల్ఫేర్ సొసైటీ రూ. 10,000, రాయల్ రెడ్డి యూత్ సభ్యులు రూ. 12,500, అలాగే కోండ్రు మనోహర్ రెడ్డి రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 27,500 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి ఆసరాగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న యువతను గ్రామస్తులు, పలువురు ప్రముఖులు అభినందించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రమేష్ గౌడ్, భీమలింగం, రమణారావు, మోహన్, ప్రవీణ్, రాహుల్, హరీష్, భూమేష్, సురేష్, సైఫుద్దీన్, రియాజ్, అహ్మద్, కృష్ణారెడ్డి, ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో సర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి

**ఆసిఫాబాద్, జులై 13, ప్రభాతవార్త :**

రాజంపేట గ్రామపంచాయతీలోని 33 పోలింగ్ స్టేషన్ పరిధి ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని వార్డు సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గులాం జావిద్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ సక్రమంగా కొనసాగుతున్న తీరును పరిశీలిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు నమోదు, వివరాల సవరణ, అవసరమైన దరఖాస్తుల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బిఎల్‌ఓలకు సూచించారు. రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఒక్క అర్హత గల ఓటు కూడా మిస్ కాకుండా చూడాలనే లక్ష్యంతో ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న బిఎల్‌ఓ కు అవసరమైన సహకారం అందిస్తూ, ఇంటింటికీ చేరే విధంగా సమన్వయం కొనసాగిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ప్రతి అర్హ ఓటరు సర్ ప్రక్రియను పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది.

